# చౌర్యంలో క్రొత్త పంథా

శ్రీ మధురాంతకం రాజారాం

సమయం: ఉదయం 9 గంటలు

[కరుణాకరంగారి ఇంట్లో హాలు. అతని భార్య మీనాక్షి ఒకమూల కూచొని కూరగాయలు తరుగుకొంటున్నది. కుమారుడు శంకర్ కుర్చీలో కూచొని ఏదో చదువుకొంటున్నాడు. కుమార్తె అన్నపూర్ణ హాలుకూ వంటగదికీ మధ్య గడపలో నిలుచుని వున్నది]

మీనాక్షి: మీ నాన్నగారి నీలా ఒక్కసారి పిలువు శంకర్.

శంకర్: ఎక్కడున్నారని పిలవమంటావమ్మా?

మీనాక్షి: మిద్దెపైన లేరూ?

శంకర్: లేరు.

మీనాక్షి: ఐతే ఎక్కడికి వెళ్ళినట్టు?

అన్నపూర్ణ: మాకు జోస్యం తెలుసుననుకుంటున్నావామ్మా? బహుశా రీడింగ్ రూముకు వెళ్ళివుంటారు.

మీనాక్షి: ఆ రీడింగు రూమొకటి మన ప్రాణానికి! నిద్రలేవకముందే పేపరు ఇంటికే వస్తుందాయె. అక్కడికి కెందుకు వెళ్తారో, ఏమో నాకర్థం కావడంలేదు.

శంకర్: ఒక్క ఐదు నిమిషాలు అయ్యన్ను ప్రశాంతంగా చదువుకోనిస్తావామ్మా నువ్వు? అస్తమానం అదిలేదు, ఇదిలేదు అంటుంటావ్.

మీనాక్షి: లేనిదిలేదు అని ఆయనతో గాక ఇంకెవరితో చెప్పమంటావురా? లేని వస్తువు కొని తెమ్మంటారని ఇంట్లో మగవాళ్ళంతా ఇలా పరారైపోతే కాపురాలేం జరుగుతాయిరా నా తండ్రీ?

అన్నపూర్ణ: నాన్నగారిలాంటి కవులకు కావలిసింది కాపురాలు కాదమ్మా, కల్పనలు. వారు కల్పనలో దిగిపోయారంటే ఒక్క కాపురాన్నేమిటి, నిఖిల ప్రపంచాన్నీ మరచిపోతారు.

శంకర్: వారు మరచిపోయినా మనలాంటివాళ్లం జ్ఞాపకం చేస్తూనే వుంటాముగా! (విసురుగా వెళ్ళిపోతాడు)

అన్నపూర్ణ: మొన్న నేం జరిగిందో తెలుసామ్మా? నువ్వింట్లో లేవు. ఎవరో యిద్దరు నాన్నగారిని చూడడానికి వచ్చారు. వాళ్లని చూచిందే తడవుగా ఈయన 'అద్భుతమైన ప్లాట్ దొరికింది. బ్రహ్మాండమైన ప్లాట్ దొరికింది' అని వీధిలో పోయేవాళ్లు వినేట్టు చెప్పసాగారు. పాపం! ఆ ఇద్దరు పెద్దమనుషులు ఇల్లు కట్టుకోడానికి కేదైన చక్కని స్థలం దొరికిందేమో ననుకొని నాన్నగారి చేయి నొప్పిపట్టేటట్లుగా షేక్ హేండ్ చేసి పారేశారు.

మీనాక్షి: కొత్తగా ఇల్లు కట్టకపోతే పోయె; ఉన్న ఇంటికి సరిగ్గా అద్దె ఇస్తూంటే చాలు.

అన్నపూర్ణ: ఐనా నీకేమమ్మా. నువ్వు పోయి కాపురంచేసేట్టుగా వుంటే నాన్నగారు ఈ క్షణం సహారా ఎడారిలో నూరుఎకరాలు, బంగాళాఖాతంలో ఏభై ఎకరాలు తీసుకోగలరు!

మీనాక్షి: అక్కడికెందుకే పోవడం. ఇక్కడున్నా నా బ్రతుకు ఎడారిగానే వుందిగా! కట్టెలమోపు తేకపోతే ఈదినం వంటాలేదు, గింటాలేదు.

(వడివడిగా కరుణాకరం ప్రవేశించి ఈజీచేర్లో కూలబడుతాడు)

మీనాక్షి: మీ కోసమే ఎదురు చూస్తున్నాం.

కరుణా: థేంక్స్. మీ రెవరుగానీ ఒక్క అరగంటసేపు నాతో మాట్లాడ్డానికి వీలులేదు. (పైకప్పును చూస్తూ) అధ్యక్షా! మహా జనులారా! మహిళామణులారా! నాకీసమావేశంలో ప్రసంగించే అవకాశం కల్గించిన మీ కందరికీ నా ధన్యవాదాలు.

మీనాక్షి: మధ్యాన్నం వంటకు ఇప్పుడొక మోపుకట్టెలు తెచ్చి పడేయండి. తరువాత మీ ధన్యవాదాలు తీరికగా సమర్పించుకోవచ్చు.

కరుణా: (భార్యమాటలు వినిపించుకోకుండా తన ప్రసంగధోరణిలోనే) మీరు నేనేదో మహావక్తననీ, మీకు తెలియని రహస్యాల్ని విడమర్చి స్పష్టంగా తెలియజెప్పగలననీ అనుకొనివున్నట్లయితే నిజంగా మీకు కలుగబోయేది ఆశాభంగమే.

మీనాక్షి: అక్షరాలా యధార్థం చెప్పారు. మీవలన ఎంతెంతటి ఆశాభంగాలు కలుగగలవో నాకంటే బాగా యింకెవరికీ తెలియదు.

కరుణా: ఏమిటే నీ వాగుడు? ఎల్లుండి బ్రహ్మాండమైన మీటింగులో ప్రసంగించబోతున్నాను...

మీనాక్షి: ఇప్పుడు భోజనం ఎట్లా చెయ్యమంటారు?

అన్నపూర్ణ: ప్రసంగం మధ్యమధ్య ప్రశ్నలడగడం మామూలేగద నాన్నా.

మీనాక్షి: ఏం మీటింగో? అర్థరాత్రి వరకూ డాబాపైన అటూ ఇటూ తిరుగుతూ మాటాడుకోవడం. తెల్లవారి మొదలు నిలువుటద్దం ముందునిలిచి వదరుకోవడం. వారం రోజులుగా ఇదో డ్యూటీ ఐపోయింది. ఇన్ని దినాలు ఏదో వ్రాసి వ్రాసి కాగితాలు ఖరాబుచేశారు. ఇప్పుడు వాగి వాగి...

కరుణా: నాన్సెన్స్.. ఇక నోరు తెరవకు. ఇకమీదట మనం సాధారణ రచయితలమే కాదు, వివేకానందునివంటి వక్తలం. వేదికపై ఎక్కి కరుణాకరం ప్రసంగిస్తున్నాడంటే వేణుగానం విన్న నాగకన్యలవలె సభ తన్మయత్వం చెందిపోవాలి. మధ్యమధ్య లేచే కరతాళ ధ్వనులకి మిన్నూ మన్నూ ఏకమైపోవాలి.

మీనాక్షి: ఐపోతుందనుకోండి. దానివల్ల మీకేమైనా లాభమా?

కరుణా: లాభనష్టాలు వర్తకంలో. కళావిషయికంగా లాభనష్టాలు పాటించడం మహాఘోరం. 'కళకోసమే కళ' అన్నాడొక కళావేత్త.

మీనాక్షి: పెద్దలు సంపాదించి పెట్టిపోయిన ఆస్తిని తెగనమ్మి తింటూ అందరూ హాయిగా ఇంట్లో కూచొని 'కళ కళ' అని కళాభజన ప్రారంభిస్తే ప్రపంచనాటకం పరిసమాప్తి చెందినట్టే. మొదట బ్రతుకు తెరువు, తరువాత కళ.

అన్నపూర్ణ: నాన్నకంటే నువ్వే బాగా ఇవ్వగలవమ్మా లెక్చరు. మీ రిద్దరూ చేరి ఒక పక్షంగా ఎలక్షన్‌లో నిలబడ్డారంటే అక్షరాలా విజయం మీదే.

కరుణాకరం: ఇక ఊరుకోండి. (ప్రసంగధోరణిలో) నేను యధార్థాన్ని మించి

పైబ్రో
గర్భాశయ రోగనివారిణి

సర్వ గర్భాశయ వ్యాధులను పూర్తిగా పోగొట్టి, సత్సంతానమును కలుగ జేయుటలో మా పైబ్రో మిక్కిలి ఘనతవహించినది. అన్ని షాపులలో దొరకును.

రు 2-8-0

కృష్ణా లేబరేటరీ
బెజవాడ

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
(రిజిష్టర్డు)
కుష్టు, బొల్లి, సుఖ రోగోది
చికిత్సలకు నేడే సంప్రతించండి.
నకలు మందులు చూసి మోస పోకుడు.
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం
మొదలగు పట్టణములలో.

గనోక్యూర్
అన్నిసెగలకు గంటలలో గుణము
ఈశ్వర ఫార్మసి, రాజమండ్రి.

మరొక్క మాట మాటాడలేను. 'యథార్థ వాదీ లోక విరోధి' అన్నారు పెద్దలు. ఐనా కానీండి. మొట్టమొదట నే నెత్తు కొంటున్న విషయ మేమంటే...

మీనాక్షి : (భర్త ప్రసంగంతో కలుగ జేసుకొని) వంటచెరకు లేనిదానివల్ల ఇంటిలో వంట నాస్తిగావడం. కాపురంయొక్క బాగోగుల్ని ఇసుమంతైనా గమనించని ఇంటి యజమాని ఆ ఇంటికిమాత్రమే విరోధికాదు; దేశానికే విరోధి!

అన్నపూర్ణ : బలే! మువ్వెగాన్ని వేదిక పై ఎక్కావంటే అస్సాంభూకంపమంత హర్షధ్వానం చెలరేగుతుందమ్మా. నానా నువ్వూ కలిసి ఆంధ్రరాష్ట్రం కావాలని ప్రచారంజేస్తూ దేశ పర్యటనమే ప్రారంభించవచ్చునే.

మీనాక్షి : ఇదిగో ఈలా చూడండి. మీరు ప్రసంగంచేయండి, పాడండి, భరత నాట్యం ఆడండి. ఏమైనా చేయండి. కానీ ఇంట్లోవాళ్ళు బ్రతుకుతున్నారా చస్తున్నారా అని గమనించడం మాత్రం మరచి పోవద్దండి. ఇంకొక విషయం కూడా ఇప్పుడే చెప్పేస్తున్నాను. ఇంతవరకూ మీరు కథలు వ్రాసేవారు. అవి బాగుంటే ప్రచురించేవాళ్ళు లేకుంటే వాపసుపంపే వాళ్ళు. సమావేశంలో మాటాడ్డమంటే అంత సులభమైన పనిగాదు.

కరుణా : ఎందుకు కాదు?

మీనాక్షి : 'కూచో' 'లోపల పో' 'నోర్మూయ్' ఈలాంటి కేకలు లేస్తాయి.

కరుణా : నోర్మూయ్ అపశకున పక్షీ! సాయంత్రం ఎట్లాగైనా కట్టెలమోపు తెచ్చి ఇంట్లోపడేస్తాను.

మీనాక్షి : ఐతే అర్ధరాత్రికే భోజనం కూడా తయారౌతుంది.

(వీధిలోనుంచి "కరుణాకరంగారున్నారండీ" అనే కేక వినబడుతుంది. కరుణాకరం ద్వారందగ్గరికి వెళ్ళి 'రండి రండి' అని ఆహ్వానిస్తాడు. మీనాక్షి, అన్నపూర్ణలోపలికి వెళ్ళిపోతారు. ఆగంతకుడు వచ్చి కుర్చీలో కూచొంటాడు)

కరుణా : మిమ్మల్నింతవరకూ నేను చూచినట్టులేదు.

ఆగం : నేను మిమ్మల్ని ఎన్నోసార్లు చూచివున్నానండి. మీకు తెలిసే వుంటుంది ఈవూళ్ళో 'యువజనసమితి' అనే సంస్థ ఒకటుందని. దానికి నేను కార్యదర్శిని. రేపు మేమొక మీటింగు ఏర్పాటుచేసి వున్నాం, అందు కధ్యక్షుణ్ణిగా...

కరుణా : నన్ను పిలుస్తున్నారు. అంతే గదా! అవశ్యం వచ్చి మీ కార్యాన్ని జయప్రదంగా నెరవేరుస్తాను. ఐతే నన్ను దేన్నిగురించి మాట్లాడమంటారండి?

ఆగం : మీరు దేన్నిగురించి మాటాడినా వినేందుకు మేము సిద్ధంగా కాచుకొని వున్నామండి, రేపు నాలుగు గంటలకువచ్చి మిమ్మల్ని పిలుచుకొని పోతాను. (లేచి) నాపేరు రంగనాయకులు, వస్తాను. (వెళ్ళిపోతాడు)

శంకర్ : (ప్రవేశించి) నోట్సు కొనుక్కోవాలి నాన్నా. ఒక రూపాయ కావాలి.

కరుణా : (పైమాటల్ని చెవిలో వేసుకోకుండా) సభాసదులారా! నేడు మానవ జీవితాన్ని ఎన్నో సమస్య లెదుర్కొంటున్నాయ్. స్వప్రయత్నంచేత మానవుడు ఈసమస్యల్ని ఛేదిస్తేగాని ప్రపంచానికి శాంతిలేదు.

శంకర్ : నేను "కవర్లీ పేపర్స్"కి నోట్సు కొనుక్కోవాలినాన్నా.

కరుణా : నోట్సు తరువాత కొనుక్కొందువుగానీ మొదట ఒక కాగితం తెచ్చి నేను చెప్పినట్లు వ్రాయి. ప్రసంగం యొక్క పూర్తిపాఠం ఇప్పుడే తయారై పోవాలి.

శంకర్ : కాలేజికి టైమై పోతుంది నాన్నా.

కరుణా : పరవాలేదులే, నీకాలేజి చదువు ఎప్పుడూ వున్నదే. కాగితమూ పేనా తీసుకో.

## 2

(మరునాడు సాయంత్రం మూడు గంటలు. కరుణాకరం నిలువుటద్దం ముందు నిలబడి 'డ్రెస్' చేసుకొంటున్నాడు.)

శంకర్ : (ప్రవేశించి) నిన్న వచ్చిన కార్యదర్శి మిమ్మల్ని పిలువమంటున్నాడు నాన్నా.

కరుణా : అతణ్ణి యిక్కడికే రమ్మను (రంగనాయకులు ప్రవేశిస్తాడు) అన్నట్లు మీటింగు ఎన్నిగంటలకండీ?

రంగ : సరిగ్గా నాలుగున్నరకు ప్రారంభమండీ. అర్జంటుగా బజారువెళ్తున్నాను పూలమాలకోసం, మళ్లీ ఇక్కడికి రావడానికి నాకు టైముండదు. జట్కా పంపిస్తాను. మీరు మరేమీ అనుకోరుగదా.

కరుణా : అబ్బే! అలా అనుకొనే మనిషిని కానండి. మీరు వెళ్ళి మీ పనులు చూడండి. నేను వచ్చేస్తాను.

రంగ : (లేచి వెళ్ళబోతూ) ఇంకొక విషయం. ఉన్నట్లుండి ఈ దినం మా గడియారం ఆగిపోయింది మీ టైంపీస్

(22-వ పేజీ చూడండి)

## పాక ప్రవీణ

(15-వ పేజీ తరువాయి)

అయింది. తల వంచుకు లోనికి వెళ్ళింది. వంటసాయానికి వచ్చిన అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకొంటూ తమ తమ తప్పులు ఏకరువుపెట్టుకొంటున్నారు. "మీ అందరి ఆసరా చాతకదా నేను రమణమ్మకి శాస్తి చేయాలని ఇలాంటిపనికి పూనుకున్నాను." అనికళ్ళనీళ్ళురాల్చిందికమలమ్మ.

మేజస్ట్రేట్ పెళ్లాం ముఖం చిట్లించి "నాకీ వంటపని అంటే తలనొప్పి. ఏదో మీ మాట దాటకూడదని వచ్చా. పుట్టింట ఎరగను, మెట్టినింట ఎరగను పొగ," అన్నది చాలా చులకగా.




మిగతా ఇదరు ముఖాలు వంచుకొన్నారు. అక్కడికొచ్చి ఆ మాటలు విన్న ఓ మిడిమేలపు పిల్లవాడు పరుగున హాలులోకి వెళ్లాడు. "రమణమ్మ రాలేదు వంటకి. మేజస్ట్రేట్ అత్తయ్య, రామమ్మత్తయ్య, జ్ఞానమ్మ పిన్ని, కమలమ్మ పిన్ని వండారు" అని అరిచి చాటించాడు. మేజస్ట్రేట్ ముఖం చింతగింజంత అయినా..."అదే అప్పుడే పసిగట్టేశాను. రమణమ్మవంట కాదని" అన్నాడు.

ఈ మాటలు రమణమ్మవింటే ఆమెకు ఇంకా గర్వమే హెచ్చవుతుందని గృహిణులు తలలు వేళ్లాడతీసుకొన్నారు.

ఇది జరిగి నాలుగురోజు లయిపోయింది. రమణమ్మ మాత్రం ఆ విషయం ఎవ్వరిన్నీ అడిగి తెల్సుకోలేదు. కానీ ఆమెకు అంతా తెల్సు. అందరిళ్ళకూ మామూలుప్రకారం వచ్చిపోతుంటుంది. ఆనాటినుండీ ఇతర గృహిణులు కూడా వంటపని అంటే శ్రద్ధ చూపిస్తూ వుండేవాళ్లు. వంటఅంటే భయపడే ఆడదీ, అసహ్యించుకొనే స్త్రీ, బద్ధకించే సోమరీ...ఎలా చెయ్యడం అని దిగులుపడే ఇల్లాలూ "వంటపని" శ్రద్ధగా చేస్తున్నారు. అందరూ రమణమ్మని నిగూఢంగా అడిగి కిటుకులు తెల్సుకోవాలని ప్లాను వేసుకొన్నారు.

వడుగుభోజనంనుంచి లేస్తూ మేజస్ట్రేట్ అన్నాడు "గోపాలంబాబూ: ఇదేం బాగాలేదు. మాకు త్వరలో గొప్పవిందు చేయాలి. ఆ విందు వెలుగులో ఈ మచ్చ మాసిపోవాలి. ఏదన్నా చూడు నీ పుట్టినరోజన్నా వస్తుందేమో!" గోపాలంబాబు ఆ తర్వాత కమలమ్మని నాలుగూ అడిగేసరికి అసలు విషయం బయటపడ్డది. "ఈ ఆడవాళ్లిప్పుడూ ఇంతే! ఎప్పుడూ కలహాలు. కలకంఠులు కారు కలహకంఠులు. రమణమ్మని మనే పిలవాలి. అందరూ ఏమన్నారో తెలుసా? మరో డిన్నర్ కావాలట" అని చెప్పాడు.

కమలమ్మ సంకోచం లేకుండానే ఆనాడు రమణమ్మ రాగానే విషయం అంతా చెప్పివేసింది. రమణమ్మ నవ్వుతూ "అదేం భాగ్యం లెండి. ఆడవాళ్ళకు వంట చాతకాకపోతుందీ. వంట అంటే అదో నీచమైన ఉద్యోగమని, వంటలక్క, అనిపించుకొంటే తమ పరువుకి నష్టమని అనుకొంటారు. ఆడది జీవితంలో సాధించవలసింది, సాధించేది "వంటే" అని నా అభిప్రాయం. కోటివిద్యలు కూటికొరకే కదా! వంటపని లేకపోతే ఆ తర్వాత ఒకళ్ళ కొకరితో పనేముంది? నలభీమపాకాలని మీరు విని వుండలేదా? పూర్వం వాళ్లు కూడా "వంటే" చేసి పేరు పొందారు. శ్రద్ధపెడితే బ్రహ్మవిద్య కూసువిద్యయిపోతుంది" అని చిన్న లెక్చర్ కొట్టింది. ఆనాటి విందులో అధ్యక్షత వహించిన ఓ మంత్రి "పాకప్రవీణ" అని బిరుదుఇచ్చి రమణమ్మని సత్కరించారు. డిన్నర్ అయింతర్వాత! ★

## చౌర్యంలో క్రొత్తపంథా

(14-వ పేజీ తరువాయి)

కొంచెం ఇచ్చారంటే మీటింగు ఐపోయిందే...

కరుణా: దానికేమండీ తీసుకెళ్లండి.

(గడియారం తీసుకొని రంగనాయకులు నిష్క్రమిస్తాడు.)

### 3

(ఆ దినం రాత్రి ఏడుగంటలకు-కరుణాకరం చెమటకార్చుకుంటూ వచ్చి మంచం పైన పడిపోతాడు.)

శంకర్: మీటింగు అప్పుడే ఐపోయిందా నాన్నా?

అన్నపూర్ణ: బాగా మాట్లాడారా నాన్నా? *Funk* గా లేదుగదా.

శంకర్: పత్రికా ప్రతినిధు లందరూ వచ్చారా?

మీనాక్షి: కొంచెం నిదానించండి. బాగా టిఫిన్ చేసి వచ్చినట్లుంది. భుక్తాయాసం తీరనీ.

కరుణా: టిఫినెక్కడిదే? వాడెవడో పచ్చిదొంగ. గడియారానికని ప్లాను వేసి నాకు నున్నగా తిరుక్షౌరం చేసేశాడు.

మీనాక్షి: అయ్యయ్యో! ఇంతకూ ఏం జరిగిందండీ?

కరుణా: జట్కా వాడు ఇక్కడికి రెండుమైళ్ళ దూరంలో ఒక సందులో నన్ను దిగమన్నాడు. అక్కడ బ్రహ్మాండమైన పందిరేమో వుంది. కానీ అక్కడేదో సంతర్పణ జరుగుతుందట. తీరా విచారించబోయేసరికి 'యువజన సమితి' అనే సంస్థే ఈ వూర్లో లేదట! ఎవడో పట్టపగలే నా కండ్లల్లో కారం కొట్టేశాడు.

మీనాక్షి: మిమ్మల్ని చూస్తుంటే ఏడుపూ వస్తున్నది, నవ్వూ వస్తున్నదండీ! పోనీ ఆ సంతర్పణలో భోంచేసైనా రాకపోయారా?

కరుణా: ఏమి భోజనమో! ఏ మిబ్రతుకో! ఏమి ప్రపంచమో! అంతామిథ్య.

మీనాక్షి: గడియారం దొంగలింపబడడం కూడా మిథ్యేనా? వెర్రివేదాంతాన్ని కట్టిపెట్టి లేవండి భోజనానికి. ★